# పేరులో ఏముంది?

ఏ ముహూర్తంలో మా తాతగారు నాకు పేరు పెట్టారో గాని ఎప్పుడూ ఏదో ఒక చిక్కులో పడక తప్పటం లేదు. మా తాతగారు నాకంత జ్ఞాపకం లేరు. నా మూడు నాలుగేళ్ళ ప్రాయంలో ఆయన పోయారని మా అమ్మ చెప్పేది. మా కుటుంబం రంగూన్‌లో ఉండేది. మా నాన్న ప్రభుత్వోద్యోగి. బహుశా తాతగారు కూడా బ్రిటిష్ వారి కాలంలో ఉద్యోగ రీత్యా అక్కడికి వెళ్ళి ఉంటారు. ఐదవ తరగతి దాకా నా చదువు అక్కడే సాగింది. మాది తెలుగు కుటుంబమే కాని నేను చదివే స్కూల్లో ఇంగ్లీషు కాక మరే భారతీయ భాషా ఉండేది కాదు.

కానీ తెలుగు అక్షరాలు వ్రాయటం, చదవటం ఇంట్లో మా అమ్మ నేర్పింది. ఎప్పుడు చేర్చిందో గాని పెద్ద బాలశిక్ష ఒక పాత కాపీ ఇంట్లో ఉండేది. దానిలో నుండి కథలు, సామెతలు వగైరా చదివి వినిపిస్తూ ఉండేది. ఇక మా నాన్నగారయితే ఏవేవో పాత పుస్తకాలు దగ్గర పెట్టుకొని పద్యాలు రాగయుక్తంగా చదువుతుండేవారు. ఆ రాగాలు నాకూ అలవడ్డాయి. ఆయన వద్దే ఎన్నో తెలుగు పద్యాలు నేర్చుకొన్నాను. కాని ఆ పుస్తకాలు పొరపాటున కూడా నేను తెరిచేవాడిని కాదు. ఆ కాగితాలు రంగు మారిపోయి చేయి తగిలితే చేతికి అంటుకొనేంత మెత్తగా ఉండేవి. నాన్నగారు మాత్రం వాటిని భద్రంగా తెరిచేవారు. భక్తిగా మూసి పెట్టేవారు.

ఇంతకూ నా పేరు చెప్పనే లేదు. ఎడ్వర్డ్ వెంకటశాస్త్రి. ఇ.వి. శాస్త్రి అని వ్రాసుకునేవాడిని. తమిళ సంప్రదాయమో, మరే సంప్రదాయమో తెలీదు కాని అందరి తెలుగు కుటుంబాల వలె మాకు ఇంటి పేరు లేదు.

నేను ఐదో తరగతి చదువుతుండగా మా కుటుంబం ఇండియాకు అంటే మద్రాసుకు వచ్చింది. అక్కడే నా చదువంతా సాగింది. అక్కడ పచ్చయప్ప కాలేజీలో ఫిలాసఫీలో బి.ఏ. ఆనర్స్ చేశాను.

అప్పుడే మా నాన్నగారు ఉద్యోగరీత్యా ఢిల్లీకి వచ్చారు. మేమందరం ఢిల్లీకి వచ్చాం. నేను సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో యం.ఏ. చేశాను. అక్కడే లెక్చరరుగా చేరాను. ఇది ఇరవై ఐదేళ్ళ నాటి మాట.

ఆ తర్వాత జీవితంలో రావలసిన మార్పులన్నీ వచ్చాయి. కాని ప్రతి మలుపు వద్దా నా పేరు ఒక ప్రశ్నార్థకంగా నిలబడేది. ఢిల్లీ జీవితంలో దేశంలోని అన్ని

ప్రాంతాల వారూ తారసపడతారు గనుక వ్యక్తిగత విషయాలలో అంతగా కుతూహలం ప్రదర్శించరు. ఏ పేరో, ఏ కులమో కూడా ఎవరికీ పట్టదు. అయితే రాష్ట్రం పట్ల ఆసక్తి ఉంటుంది. ఒకప్పుడు మద్రాసీలనే వారిని ఇప్పుడు సౌత్ ఇండియన్స్ అని అంటున్నారు. కొంచెం బాగా చదువుకొన్న వాళ్లయితే రాష్ట్రం పేరు గుర్తు పెట్టుకొంటారు.

తెలుగువాళ్ళయితే "మీరు తెలుగువాళ్ళా, అరవవాళ్ళా" అని అడుగు తుంటారు. "మీ తెలుగు బాగానే ఉంటుంది కాబట్టి మీరు తెలుగువాళ్ళయి ఉండాలి" అని వాళ్ళే ఓ నిర్ణయానికి వచ్చేవారు. ఆ తర్వాత "ఏ ఊరు" అని అడిగేవారు. నా జీవిత చరిత్రంతా చెప్పేసరికి "మద్రాసా?" అని చప్పరించేవారు. "కాకపోయినా మీ పూర్వీకులు ఆంధ్రలో ఏ ప్రాంతం నుండయినా అంటే రాయలసీమ, తెలంగాణ, ఆంధ్ర, ఉత్తరాంధ్ర వంటి ప్రదేశాలకు చెంది ఉండాలి కదా" అని పరిశోధనాత్మకమైన ప్రశ్నొకటి వదిలేవారు.

"మద్రాసు దగ్గరే ఏదో ఊరు. నాకంతగా తెలీదు. ఎప్పుడో మా తాతగారు రంగూన్‌కు వెళ్ళారు" అనే వాడిని.

"నిజమేలే. ఆ రోజుల్లో అంతా మద్రాసే కదా" అని తల ఊపేవారు.

నాకు ఈ ముక్క చెక్కలుగా ఆలోచించటం మొదటినుండీ లేదు. నేను పుట్టి పెరిగిన ప్రాంతం, చదువుకొన్న స్థలాలు, మా ఇంటి వాతావరణం ఇందుకు కారణం కావచ్చు.

ఒకసారి వారణాసి నుండి వచ్చిన మిత్రుడొకడు "మీరు శాస్త్రి ఎప్పుడు పాసయ్యారు?" అని అడిగాడు.

నా తల తిరిగిపోయింది. "ఏమిటన్నారు?" అన్నాను.

"మీరు సంస్కృత పండితులు కదా?" అన్నాడు.

"అబ్బే అలాంటిదేమీ లేదు. మా భాషలో సంస్కృతం ఎక్కువ గనుక కొద్దిగా ఆ జ్ఞానముంది తప్పితే మా నాన్నగారి దగ్గర కొన్ని శ్లోకాలూ అవీ నేర్చుకొన్నాను. బాగా విడమర్చి చెప్పేవారు" అన్నాను.

అతను నవ్వాడు. "బలే జోక్ చేస్తారే" అన్నాడు. అందులో జోకేమిటో నాకు అర్థం కాలేదు.

"కొన్ని శ్లోకాలు నేర్చుకొన్నందుకే మీకు 'శాస్త్రి' పట్టా ఇచ్చారా?"

"నాకెవ్వరూ ఇవ్వలేదు. మా అమ్మా నాన్నా పెట్టిన పేరది."

అప్పుడు నా కొలీగ్ ఇంకొకతను విడమర్చి చెప్పాడు. "శాస్త్రి" అనే ఒక డిగ్రీ కోర్సు లాంటిది ఉందట.

మహారాష్ట్ర యూనివర్సిటీ ఒకదానికి కొన్నాళ్ళు విజిటింగ్ ప్రొఫెసర్‌గా వెళ్ళాను. అక్కడ మరాఠీ బోధించే ఒక ప్రొఫెసర్‌తో పరిచయమయింది. ఆయన పేరు విఠల్‌శాస్త్రి. మేమిద్దరం ఉన్నప్పుడు ఎవరైనా "ప్రొఫెసర్ శాస్త్రి" అని పిలిస్తే కాస్త తికమకగా ఉండేది. ఆ సందర్భంలో ఒకాయన "మీరిద్దరూ శాస్త్రులే కదా! బ్రాహ్మణోత్తములు. ఎవరు పలికినా పర్వాలేదు" అంటూ పరిహాసమాడాడు.

దానితో మరాఠీ ప్రొఫెసర్‌కు కోపం వచ్చింది. "నేను అట్టడుగు నుండి పైకి వచ్చిన వాడిని. నెత్తిన బరువులు మోసిన వాడిని. కష్టపడిన వాడిని. మీలో ఎవరైనా నాలా కష్టపడ్డారా? ఏ మాత్రం బాధలైనా అనుభవించారా? మానసికంగా కుంగిపోయారా? అన్నీ చక్కగా అమరితే ఎవరైనా చదవవచ్చు పై చదువులు. వెలగబెట్టొచ్చు గొప్ప ఉద్యోగాలు. నన్నూ, నా కులాన్ని అందరూ హీనంగా చూస్తారని నాకు తెలుసు. చదువుకొనే రోజుల్లోనే ఇదంతా గమనించాను. అందుకే అగ్ర కులాలనే వాళ్ళ మీద కక్ష కొద్దీ 'శాస్త్రి' అనే పేరుకేమైనా కాపీ రైటుందా అనే కోపం కొద్దీ నా పేరుకు 'శాస్త్రి' తగిలించుకొన్నాను" అన్నాడు.

ఈసారి తెల్లబోవటం నా వంతయింది. ఒక పేరు వెనుక ఇన్నిన్ని అర్థాలుంటాయని నాకెన్నడూ తోచలేదు. "శాస్త్రి' అంటే బ్రాహ్మణుడికి బ్రాండ్ నేమ్ అని కూడా నేననుకోలేదు. శాస్త్రాలు తెలిసినవాడు అంటే ఏ పండితుడయినా శాస్త్రి అనే అనుకొన్నాను. ఇది నా తెలివితక్కువతనమేమో!

ఒక పార్టీలో ఒక తెలుగాయన కలిశాడు. "శాస్త్రిగారూ! మీరు ఇ.వి. శాస్త్రి కదా, ఇ అంటే ఏమిటండీ?" అని అడిగాడు.

"ఎడ్వర్డ్" అన్నాను.

ఆయన ఉలికిపడినట్లు ఆయన కప్పులోని సూపు తొణికింది.

కాస్త గొంతు తగ్గించి "మీరసలు క్రిస్టియన్‌లా కనిపించరు" అన్నాడు.

"క్రిస్టియన్లు ఎలా కనిపిస్తారేమిటి?" అని అడిగాను.

"కొంచెం తెలిసిపోతుందిలెండి. ఇంతకూ..."

"నేను క్రిస్టియన్ అని ఎందుకనుకొన్నారు?"

"ఎడ్వర్డ్ క్రిస్టియన్ పేరు కదా!"

కథా నిలయం
శ్రీకాకుళం

"ఏమో మరి. మా తాతగారు బ్రిటిష్ రాజు ఎడ్వర్డ్ పేరు నాకు పెట్టినట్టున్నారు," అని అన్నాను.

ఇదేదో తిక్క వ్యవహారమనుకొన్నట్టున్నాడు. "ఎక్స్‌క్యూజ్‌మీ" అంటూ అక్కడి నుండి కదిలాడు.

ఇంటలెక్చువల్ అంటే బుద్ధి జీవిగా కనపడటానికి గడ్డం పెంచాలనే ఫ్యాషన్ ఎప్పుడొచ్చిందో నాకు తెలీదు. కాని నేను ముప్పయ్యేళ్ళు దాటాకే గడ్డం పెంచాను. ప్రొఫెసర్ అయ్యేసరికి అక్కడక్కడా తెల్ల వెంట్రుకలతో నా తల, నా గడ్డం నాకొక పర్సనాలిటీ తెచ్చాయని నేననుకొన్నాను. ఏదో ఒకటి గాని ఎవరూ దీని గురించి తేలిగ్గా మాట్లాడలేదు. మా ఇంట్లో కూడా అందుకేనేమో నేను ఏ ప్రాంతం వాడినో ఎవరూ నిర్ణయించలేకపోయేవారు. ఎక్కడికి వెళ్ళినా అవతలి వాళ్ళ కళ్ళలో "పెద్ద మనిషి" అన్న భావం కనిపించేది. అదీ మంచిదే అనుకొన్నాను.

ఈ మధ్య తిరువనంతపురంలో ఒక కాన్ఫరెన్స్‌కు వెళ్ళాను. కేరళకు వెళ్ళటం నాకు అదే మొదటిసారి. ఊళ్ళో చూడవలసినవి ఏమేమి ఉన్నాయని అడిగితే అనంత పద్మనాభ స్వామి ఆలయం కూడా చూడవలసిందేనని అన్నారు.

కాన్ఫరెన్స్ పదికి గాని ప్రారంభం కాదు. ఉదయమే దైవ దర్శనం చేసుకొందామని అనుకొన్నాను. దేవాలయం ఎక్కడని ప్రొఫెసర్ జార్జిని అడిగాను. నేను తీసుకెళ్తాను అని చెప్పాడు. ఆ రోజు ఒకటే తుంపర. అయినా వానలో తడుస్తూ వెళ్ళాం. చొక్కా తీసేసి కండువా కప్పుకొంటే మంచిదని ఇదివరకే జార్జి చెప్పాడు. కాని నా దగ్గర కండువా లేదు. ఆ వానకు, చలికి చొక్కా తీయాలనీ లేదు. కాని జార్జి మాత్రం అన్ని హంగులతో వచ్చాడు.

గుడిలో ప్రవేశమప్పుడు జార్జి ధీమాగా ముందుకు వెళ్ళిపోయాడు. నన్ను మాత్రం ఒకాయన ఆపేశాడు.

"ఎందుకు ఆపారు?" అన్నాను.

"మీ పేరేమిటి" అని అడిగాడు.

"ఇ.వి. శాస్త్రి" అన్నాను.

అతను నా మొహాన్ని, నా గడ్డాన్ని, నా దుస్తులను పరిశీలనగా చూశాడు.

"ఎక్కడి నుండి వచ్చారు?" అన్నాడు.

"ఢిల్లీ నుంచి" అని సమాధానమిచ్చాను.

ఇంతలో ఇంకొకతను చేరాడు. వీరందరూ పవిత్రంగా కనిపిస్తున్నారు. భక్తులెవరో, పూజారులెవరో చెప్పటం కష్టం. వాళ్ళలో వాళ్ళు ఏదో మలయాళంలో మాట్లాడు కొన్నారు. "సార్ ఏమనుకోకండి. మీ గుర్తింపు కార్డు చూపించండి. మాకు కొంచెం సెక్యూరిటీ ప్రాబ్లెం" అని ఒకతను అన్నాడు.

నాకు నవ్వు వచ్చింది. నేను భగవంతుని భద్రత కోరటానికి వచ్చాను. ఇక్కడేమో నా వల్ల దేవుడి భద్రతకే ప్రమాదమంటున్నారు. పాకెట్‌లో నుండి ఐడెంటిటీ కార్డు తీసి చూపించాను. ఆయన నా మొహాన్ని ఐడెంటిటీ కార్డులోని ఫోటోను పరిశీలనగా చూశాడు.

"సారీ, మీరు వెళ్ళొచ్చు. ఏమనుకోకండి ఏదో మా జాగ్రత్త. అటు నుండి కుడివైపుగా వెళ్ళండి" అని ఆ పెద్ద వరండా వైపు చేయి చూపించాడు.

ఒక్క క్షణంలో, ఆ చీకట్లో ఆ స్వామిని ఏమి చూశానో తెలీదు. కిందకు జార్చినట్లున్న చేయి మాత్రం కనిపించింది. చేతులు జోడించి ఇవతలికి వచ్చాను. జార్జి నా కోసం ఎదురు చూస్తున్నాడు. "ఏమింత ఆలస్యమయింది?" అన్నాడు.

"అక్కడ వాళ్ళు నా ఐడెంటిటీ కార్డు చూపించమన్నారు."

జార్జి నవ్వాడు.

"ఎందుకు నవ్వుతున్నావ్" అని అడిగాను.

"నీ వేషం చూసి, నేను చూడు ఎంత హాయిగా వెళ్లిపోయానో."

"నా వేషమెలా ఉందేమిటి?" అని గడ్డం తడుముకొన్నాను.

ఈసారి అనుభవం అలీఘుడ్‌లో. యూనివర్సిటీ వాళ్ళు ఏదో ఒక అడ్వయిజరీ కమిటీలో నన్ను మెంబరుగా వేశారు. ఆ మీటింగ్‌కని బయలుదేరాను. ఒక రాత్రి ప్రయాణం కనుక హాయిగా ట్రెన్‌లోనే వెళ్ళాను. నేను వస్తున్నానని ఏ వివరాలూ ఇవ్వలేదు. అందుకే స్టేషన్‌కు ఎవరూ రాలేదు. సరే తెలిసిన ప్రాంతమే కదా అని ఆటో రిక్షాను పిలిచాను.

"యూనివర్సిటీకా? యాభై రూపాయలు" అన్నాడతను తన తెల్లటి లేసు టోపీ సర్దుకొంటూ.

"మీటరు ప్రకారం తీసుకో" అన్నాను.

"అది పని చెయ్యటం లేదు."

నేను ఆటో ఎక్కాను. అది స్టార్టయింది.

"భాయిసాబ్, కొంచెం రేటు ఎక్కువగా చెపుతున్నావు కదా" అన్నాను.

"లేదు సాబ్. మీకు నేనెందుకు ఎక్కువ రేటు చెపుతాను. మీ దగ్గర ఎక్కువ డబ్బు తీసుకొంటానా?" అన్నాడతను బండి ముందుకు పోనిస్తూ.

"నా దగ్గర అంటే అర్థం?" అని అడిగాడు.

"మీరూ ముసల్మానే. నేనూ ముసల్మానే. మీ దగ్గర ఎక్కువ రేటు తీసుకొంటానని ఎలా అనుకొన్నారు?"

నాకు నవ్వు వచ్చింది. చివరకు అడిగాను. "అది సరే. నేను ముసల్మాన్ అని నీకెలా తెలిసింది?"

"మీకూ, నాకూ తెలిసినా తెలీకపోయినా అల్లాకు తెలుసు కదా" అన్నాడతను.

నిజమే. సర్వజ్ఞుడైన అల్లాకు అన్నీ తెలుసు. అందుకేనేమో షేక్స్‌పియర్ "పేరులో ఏముంది?" అన్నాడు. 'రోజ్'ను ఏ పేరుతో పిలిచినా దాని పరిమళం ఒకటే కదా అన్నాడు. ఇంతకూ 'రోజ్'ను అదే 'గులాబ్'ను తెలుగులో ఏమంటారు? రాయలసీమలో, తెలంగాణలో, ఆంధ్రలో, ఉత్తరాంధ్రలో - పువ్వే కదా! ఇక్కడ ఐడెంటిటీ క్రైసిస్, గుర్తింపు సంక్షోభం, ఏమీ లేదు కదా!

పత్రిక మాసపత్రిక

మే 2005